# శుక్రనీతి

కన్నకూతురికి పెళ్లి కుదిరిందంటే ఏ తల్లిదండ్రులైనా ఎగిరి గంతులు వేస్తారు. మెలికెలు తిరిగిపోతారు. కాని శైవలినికి పెళ్లికుదిరిందంటే ఆ తల్లిదండ్రులు విచారసాగరంలో మునిగిపోయారు.

కాబోయే అల్లుడు అందవిహీనుడా? కాడు నవమన్మథుడే! ఉద్యోగం స్థిరమైనది కాదా? స్థిరమైనదే! చిన్న ఉద్యోగమా! కాదు అహమ్మదాబాద్‌లోని ఓ టెక్స్టైల్ మిల్లులో డిజైన్ ఇంజనీర్! కట్నం ఎక్కువ డిమాండ్ చేశాడా? లేదు! కట్నం లేకుండానే పెళ్లి చేసుకుంటున్నాడు. "మీ రివ్వదలచిన కట్నమేదో అమ్మాయి పేర ఫిక్సెడ్ డిపాజిట్‌లో వేసేయండి!" అని చెప్పిన సహృదయశీలి, సౌజన్యమూర్తి. మరైతే శైవలిని తల్లిదండ్రులకు దేనికి విచారం?

ఊళ్లో ఎక్కడా కల్యాణమంటపాలు ఖాళీగా లేవు. ఆర్నెల్లముందే పూర్తిగా బుక్ అయిపోయాయి. కానీ ఇంట్లోనే ఎలాగో అలాగ వీధిలో షామియానా వేసి పెళ్లి జరిపించేద్దామా అంటే తాముంటున్నది అద్దెకొంప! ఇంటి యజమానులు తమ ఇంట్లో పెళ్లి చెయ్యడానికి ఒప్పుకోలేదు. పెళ్లి కొచ్చినవారు ఇల్లంతా తొక్కేసి, గచ్చులు, పెచ్చులు ఊడగొట్టేస్తారు. ఇంట్లో నూతి నీళ్ల డ్రమ్ముల నిండా తోడేస్తే, మళ్లా మర్నాటికి నీళ్లు ఊరవు. నీళ్లకి కటకట అయిపోతుంది. తాము అద్దెకుంటున్న వాటా రెండు గదులు, వంటిల్లు మాత్రమే, ఇంటి యజమానులు పోనీ ఓ రెండు గదులు ఖాళీ చేసి ఇస్తే బావుణ్ణు. ఏదో కొంతవరకూ సర్దుకోవచ్చు. కానీ, ఇంటివాళ్లకీ, అద్దెకుంటున్న శైవలిని తల్లిదండ్రులకీ పచ్చగడ్డివేస్తే భగ్గుమంటుంది! ముహూర్తం దగ్గర కొచ్చేస్తోంది. ఏమిటి దారి? ఇంటివాళ్లు ముందుగా కొళాయి నీళ్లు పట్టుకోకుండా అద్దెలవాళ్లు పట్టుకోడానికి వీల్లేదు. ఇంటివాళ్లు నీళ్లు పట్టుకున్నాక ఒక వేళ అదృష్టం బావుండి తాగడం మట్టుకి ఓ బిందెడు నీళ్లు పడితే పడతాయి. లేకపోతే లేదు. అప్పుడు నూతినీళ్లే గతి! ఉప్పు నీళ్లైనా ఎలాగో దిగమింగవలసిందే!

ఇంటివాళ్ళక్కూడా ఓ పెళ్లి కావల్సిన పిల్ల ఉంది. వారిజాక్షి. ఫైనల్ బియ్యే చదువుతోంది. ఇప్పట్నుంచీ సంబంధాలు చూడ్డం మొదలెడితే డిగ్రీ పూర్తయేసరికి కుదిరిపోవచ్చు. మన ప్రస్తుతపు పెళ్లికూతురు శైవలిని తండ్రి, వారిజాక్షి తండ్రి అయిన ఇంటి యజమానిని అభ్యర్థించాడు.

"అన్నగారూ! మీ ఆశీర్వచనం వల్ల మా అమ్మాయికి పెళ్లి కుదిరింది. పెళ్లి చేద్దామంటే ఎక్కడా కల్యాణమంటపాలు, సత్రవులు ఖాళీలేవు. మీరు అనుమతి ఇస్తే, ఇక్కడే వీధిలో షామియానా వేసి పెళ్లి జరిపిస్తాం.

"వీధిలో అంటే షామియానా వేసేస్తారండీ! వచ్చిన పెళ్లివారికి స్నానాలకి నీళ్లు కావాలంటే ఈ ఒక్క నూతి నీళ్లే కదా గతి? అసలే ఎండలు మండిపోతున్నాయి. నూతిలో నీళ్లు ఎండిపోయి అడుక్కి వెళ్లిపోయాయి. మీరు డ్రమ్ముల నిండా నీళ్లు తోడించేస్తే, ఇహ వచ్చేది మట్టినీరే! అదేమిటో ఈ దిక్కుమాలిన మూహూర్తాలు ఎప్పుడూ మండువేసవిలోనే పడతాయి!" అన్నాడు విసుక్కుంటూ ఇంటి యజమాని, తన కుమార్తె వారిజాక్షి పెళ్లికుదరకుండా, అద్దెల వాళ్లమ్మాయికి కుదిరిపోయిందనే అక్కసు లోలోన ప్రదర్శిస్తూ.

"నీటి విషయంలో మిమ్మల్ని ఇబ్బంది పెట్టను అన్నగారూ! మునిసిపాలిటీకి డబ్బు కట్టి, టాంకు తెప్పించుకుంటాం" అన్నాడు. శైవలిని తండ్రి.

"నిజమేనండీ! నీళ్లంటే పోనీ మునిసిపాలిటీ వారికి డబ్బు కట్టి తెప్పించుకుంటారు. ఇల్లంతా మీ చుట్టాలతోనూ, పక్కాలతోనూ తొడతొక్కిడి అయిపోతే, గచ్చులూ, పెచ్చులూ ఊడిపోయి, ఓ బొక్కి కొంపలా అయిపోదూ?" ఎదురు ప్రశ్న వేశాడు ఇంటియజమాని.

"మా పిల్ల పెళ్లి అయిపోయి, పెళ్లివారు వెళ్లిపోయిన మర్నాడే, నేను ఆ గచ్చులూ పెచ్చులూ సిమెంటుతో బాగుచేయించి, సున్నాలు వేయించి మీ ఇల్లు మీకు అప్పజెప్తాను. సరేనా? ఈ ఒక్క ఉపకారం చేసి పెట్టండి ప్లీజ్!" ప్రాధేయపడ్డాడు శైవలిని తండ్రి.

"వీల్లేదంటే వీల్లేదు. ఈ పెళ్లి మా ఇంట్లో జరగడానికి వీల్లేదు! మీ ఏర్పాటు మీరు చేసుకోండి" అని నిష్కర్షగా చెప్పేశారు ఇంటి యజమాని.

"వదినగారూ! శైవలినికి కాబోయే మరది కూడా పెళ్లికొడుకే, అతనొక బ్యాంకులో ఆఫీసరు! మీ అమ్మాయి వారిజాక్షిని చేసుకోమని అడిగితే బావుంటుంది. మీ ఇష్టం" అంది శైవలిని తల్లి, ఇంటి యజమానురాలితో. ఎప్పుడూ ధుమధుమ లాడుతూ ధూమకేతువులా ఉండే వారిజాక్షి తల్లిలో మందహాసం తొణికిసలాడింది. మనస్సు ఆనందతాండవం చేసింది. వారిజాక్షి తల్లి ఎప్పుడూ నవ్వి ఎరుగదు. ఆవిడ నవ్విందంటే ఏదో ప్రళయం ముంచుకొచ్చిందన్నమాటే! జ్వాలాముఖి బద్దలైనట్టే! మరేంలేదు. "మనిషి పుట్టినప్పుడు ఏడుస్తూనే పుడతాడు. మధ్యలో ఎందుకు నవ్వాలి?" అంటుంది వారిజాక్షి తల్లి. "మరైతే మనిషి పుట్టినప్పుడు దిగంబరంగానే పుడతాడు. మధ్యలో ఎందుకు బట్టకట్టాలి?" అంటారు అమ్మలక్కలు పేరంటాలకి వచ్చినప్పుడు.

"అంతకంటేనా తల్లీ! కన్యాదానం మేమే చేసినా, మీరు చేసినంత పుణ్యం! తల్లీ! ఆ ఉపకారం చేసి పెట్టండి!" బతిమాలింది వారిజాక్షి తల్లి.

వీరిద్దరి సంభాషణలూ విన్న వారిజాక్షి తండ్రి లోపల్నుంచి బయటకొచ్చి- "అమ్మా

అమ్మా! ఈ సంబంధం ఎలాగైనా రైటు చేసేయండి" అన్నాడు భార్యకు సపోర్టుగా, "అలా అయితే మీ శైవలిని, వారిజాక్షి కూడా తోడికోడళ్లయిపోతారు. వాళ్లకీ ఎంతో ఇదిగా ఉంటుంది" అంది వారిజాక్షి తల్లి.

"మరి మా శైవలిని పెళ్లికి కల్యాణమంటపమే దొరకలేదు. అదే బెంగగా ఉంది" అన్నాడు దిగులుగా శైవలిని తండ్రి. వాళ్ల మాటల మధ్య దూరుతూ.

"దానికి దిగులెందుకు తమ్ముడు! మీ శైవలిని పెళ్లి మా ఇంట్లోనే చేసుకోండి. మేము ఓ రెండు గదులు ఖాళీ చేసి ఇస్తాం. నిక్షేపంలా వీధిలో ఆకాశమంత పందిరి వేసి వివాహం దివ్యంగా జరుపుకోండి!" అని అనుమతి ఇచ్చేశాడు వారిజాక్షి తండ్రి, తన భార్య ముఖంలోకి చూస్తూ.

"దానికేముంది వదినా! లక్షణంగా ఇక్కడే మీ అమ్మాయి పెళ్లి చేసేసుకోండి. మాకే అభ్యంతరమూలేదు!" అని ఆవిడకూడా తన భర్త తీర్మానాన్ని బలపర్చింది. లోలోన తమ కుమార్తె వారిజాక్షికి కూడా, కష్టపడకుండా, తన భర్త చెప్పుల జతలు అరిగిపోకుండా సంబంధం కుదరబోతోందన్న ఆశతో. శైవలిని తల్లిదండ్రులకు బెంగ తీరింది.

ఓ ప్రధానమైన సమస్య - తమని ఇన్నాళ్లూ వేధిస్తూ బాధిస్తున్న సమస్య - తమ బుర్రల్ని దొలిచేస్తున్న సమస్య పరిష్కారమైంది. తాము అద్దెకుంటున్న ఇల్లే కల్యాణమంటపమైంది. శైవలిని పెళ్లి దివ్యంగా జరిగిపోయింది. శైవలిని పెళ్లి అయిన వెంటనే శైవలిని మరది అయిన బ్యాంకు ఆఫీసరికి, ఇంటి యజమానుల గారాబు బిడ్డ, ధనాలకుప్ప అయిన వారిజాక్షిని ఆఫర్ చేశారు ఆమె తల్లిదండ్రులు. శైవలిని మరిదికి, వారిజాక్షికి పెళ్లిచూపులయాయి. అమ్మాయి జాతకం ఇస్తే, వాళ్లబ్బాయి పనిచేస్తున్న ఊళ్లో సిద్ధాంతిగారికి చూపిస్తామని, ఓ పదిహేను రోజుల్లో తమ నిర్ణయాన్ని తెలియజేస్తామని చెప్పారు శైవలిని అత్తా, మామా. వారిజాక్షి జాతకాన్ని ఇచ్చారు ఆమె తల్లిదండ్రులు. కొత్తగా పెళ్లయాక పెళ్లికూతుర్ని 'యానాళ్ల'కని తమ ఇంటికి తీసుకెళ్లి ఐదు రోజులు ఉంచుకుని, గృహప్రవేశం, సత్యనారాయణ వ్రతం చేసుకుని, ఆ తర్వాత విందులు వినోదాలు చేసుకునే ఆచారం కోస్తా జిల్లాల్లో ఉంది. మన దేశం బ్రిటిష్ పాలనలో ఉన్నప్పుడు బాల్య వివాహాలు జరుపరాదని 'శారదా ఆక్టు' తీసుకొచ్చింది బ్రిటిష్ ప్రభుత్వం మనవాళ్లు ఆ చట్టం పరిధిలోకి రాకుండా మార్గం అన్వేషించారు. నేటి తూర్పుగోదావరి జిల్లా కాకినాడ దగ్గర ఉన్న 'యానం' ఆనాడు ఫ్రెంచ్ భూభాగం.

అక్కడ ఈ నిషేదం వర్తించదు. అంచేత యానాంవెళ్లి, అక్కడ తమ పిల్లలకు బాల్య వివాహాలు జరిపించి, ఐదునాళ్లు ఉండేవారు. ఫ్రెంచి అధికారులకి కొంత మూల్యం చెల్లించాక, వివాహం అయినట్లు ధ్రువపత్రాలు కూడా జారీ చేసేవారు. వివాహం అయిపోయాక, మన భూభాగం మీద అడుగుపెట్టాక, చట్టపరంగా వాళ్ల మీద చర్య తీసుకోవడం సాధ్యపడేది కాదు. ఆ విధంగా యానాంలో బాల్యవివాహాలు జరిపించాక, ఐదునాళ్లు ఉండడాన్ని 'యానాం'నాళ్లు - 'యానాళ్లు' అని వాడుకలోకి వచ్చింది. ఇప్పుడు యానాం మన భూభాగంలో కలిసిపోయానా 'యానాళ్లు' అనే ఆచారం మన తెలుగువాళ్లలో పాతుకుపోయింది.

శైవలిని వివాహం అయిపోయాక యానాళ్లకని, వాళ్ల అత్తగారు తమ స్వస్థలానికి తీసుకెళ్లిపోయారు ఆమెని.

ఇటు వారిజాక్షి తల్లిదండ్రులు, శైవలిని మరదితో సంబంధం ఖాయమైపోతుందన్న ఆశతో జాతకఫలితం కోసం సహస్రాక్షులతో ఎదురుచూస్తున్నారు. ఓ పదిహేను రోజులు పోయాక శైవలిని మామగారి దగ్గర నుండి వారిజాక్షి తండ్రికి ఉత్తరం వచ్చింది. అప్పుడే గ్రీష్మ ఋతువు వెళ్లి వర్షఋతువు ప్రారంభమైంది. ఉరుములు, మెఱుపులు, అశని పాతాలతో ఆకాశం దద్దరిల్లిపోయింది. తమ కుమారుని జాతకంలో వారిజాక్షి జాతకం సరిపోలేదని లేఖ సారాంశం! వారిజాక్షి తల్లిదండ్రులు బావురుమన్నారు. శైవలిని తల్లిదండ్రులు వాళ్లని ఓదార్చారు "మరేం బాధపడకండి. ఇంతకంటే మంచి సంబంధం మీ అమ్మాయికి తీసుకొస్తాం ఏదైనా మన మంచికే!" అని ధైర్యం చెప్పారు.

అసలు రహస్యం ఏమిటంటే- శైవలిని మరదికి అంతకుముందే వివాహం నిశ్చయమైపోయింది ఈ విషయాన్ని గోప్యంగా ఉంచి, ఇంటి యజమానుల పుత్రికారత్నమైన వారిజాక్షికి ఖాయం చేసెయ్యొచ్చనీ, శైవలిని తల్లిదండ్రులు పథకం వేశారు. ఆ విధంగా వాళ్లకి ఆశ జూపి, కల్యాణమంటపాలు ఎక్కడా దొరకనందుకు ఇంటి యజమానుల ఆవరణలోనే కల్యాణ వేదిక ఏర్పాటు చేసుకున్నారు. 'వారిజాక్షులందు వైవాహికము లందు - బొంకవచ్చు నధిప! పొంద దఘము' అనే శుక్రనీతిని అమలు చేశారు శైవలిని తల్లిదండ్రులు, వియ్యాలవారు ఏకమై!

13-12-1995

ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక